నీటి సమస్యా..?

155313కి కాల్ చేయండి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మహానగరానికి జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు తమ నల్లాలకు మోటార్లను బిగించుకోవడం జలమండలి అధికారుల దృష్టికి వచ్చిందని, దీని వల్ల మిగిలిన వినియోగదారులకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు. ఇది చట్టరీత్యానేరమని, తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని నల్లాలకు మోటార్లు బిగించి ఎవరైనా పట్టుబడితే వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లోప్రెషర్‌తో పాటు నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా సమీపంలోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎంలను సంప్రదించాలని లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27 : పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ రంగారెడ్డి నందు ఐదు నెలల పాటు ఉచితంగా శిక్షణనివ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉద్యోగ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ అర్హత పోటీ పరీక్షల కొరకు ఉచిత శిక్షణ శిబిరంలో చేరడానికి మార్చి 6వ తేదీ లోపు www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. మార్చి 10న జరిగే ప్రవేశ పరీక్షలో మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం 9618266091 సంప్రదించాలని సూచించారు.

ప్యాట్నీ-శామీర్‌పేట.. ప్యారడైజ్-కండ్లకోయ

ఫ్లై ఓవర్ ప్రాజెక్టులో కదలిక

- నగరాభివృద్ధిలో ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రితో సమావేశం.. సానుకూల స్పందన
- క్షేత్రస్థాయి పరిస్థితులతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న హెచ్ఎండీఏ
- గత ప్రభుత్వం సరికొత్తగా డబుల్ డెక్కర్ తరహాలో నిర్మించాలని నిర్ణయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : నగరంలో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలకు అవకాశం లేకుండా దూరదృష్టితో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో అత్యంత కీలకమైంది ప్యాట్నీ నుంచి శామీర్‌పేట వరకు ఒక ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని నిర్ణయించింది. దీని కోసం ఐదేండ్ల క్రితమే హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) ప్యాట్నీ-శామీర్‌పేటతో పాటు ప్యారడైజ్-కండ్లకోయ మార్గంలోనూ రెండు మార్గాల్లో ఫ్లై ఓవర్‌లను నిర్మించాలని ప్రతిపాదనలను సిద్ధం చేసింది. కాగా వీటిని సరికొత్తగా డబుల్ డెక్కర్ తరహాలో రోడ్డు మార్గం, మెట్రో మార్గం ఉండేలా నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.5 వేల కోట్లగా అంచనా వేశారు. నగరాభివృద్ధిలో ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూముల సేకరణకు రక్షణ శాఖ నుంచి అనుమతులు రాలేదు. దీంతో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుపై కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కీలకమైన ప్రాజెక్టును చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర రక్షణ శాఖ మంత్రితో సమావేశమయ్యారు. ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి ఎంతో కీలకమైన ఫ్లై ఓవర్ల నిర్మాణానికి అవసరమైన భూముల విషయంపై కేంద్ర మంత్రితో చర్చించారు. కేంద్రం సానుకూలంగా స్పందించడంతో హెచ్ఎండీఏ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్యాట్నీ నుంచి అల్వాల్ మీదుగా శామీర్‌పేట వైపు ప్రతిపాదనలో ఫ్లై ఓవర్ నిర్మాణంపై అధ్యయనం చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈ మార్గంలో అవసరమైన రక్షణ శాఖ భూములతో కూడిన వివరాలతో ప్రత్యేక నివేదికను సిద్ధం చేస్తున్నారు. సుమారు 5 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ఫ్లై ఓవర్ల నిర్మాణంలో కదలిక వచ్చిందని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేంద్రంగా ఉన్న రక్షణ శాఖ ఉన్నతాధికారులతోనూ ఫ్లై ఓవర్ నిర్మాణం విషయమై చర్చిస్తున్నారు. ఏ ప్రాంతంలో ఎంత స్థలం అవసరం ఉంటుంది. భద్రతా పరంగా రక్షణ శాఖ ఇచ్చే సూచనలను పరిగణలోకి తీసుకొని తుది ప్రతిపాదనలు రూపొందిస్తామని అధికారులు తెలిపారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- బోరబండ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్
- తరగతి గదులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం పరిశీలన

డీఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 27 : ఈ సారి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అందరూ ఉత్తమ ఫలితాలను సాధించి అటు పాఠశాలకు, ఇటు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం బోరబండలోని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డీఈఓ రోహిణి, ఉప విద్యాశాఖాధికారి సామ్యూల్ రాజ్‌లతో కలిసి పాఠశాలలోని తరగతి గదులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం తదితర వాటిని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధనా సిబ్బంది అందుబాటులో లేరని హెచ్ఎం గీత కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యామ్నయంగా తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న సమీప ప్రభుత్వ పాఠశాల నుంచి బోధనా సిబ్బందిని నాట్కో పాఠశాలకు రప్పించాలని కలెక్టర్ సూచించారు. చిన్న చిన్న విషయాల పట్ల నిర్ణయాలు తీసుకుని విద్యాబోధనకు ఆటంకం ఏర్పడకుండా చూడాలని, వాటినే పెద్ద సమస్యగా భావించరాదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన చదువు ఉన్నత శిఖరాలను చేరుకోవటానికి సులువైన మార్గమని పేర్కొన్నారు. సమీపంలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో వివిధ సదుపాయాలను కల్పించడానికి గతంలో ప్రభుత్వం నిర్ణయించిందని.. ఆయా పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నేత మహ్మద్ యూసుఫ్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. పరిశీలించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని డీఈఓకు కలెక్టర్ సూచించారు.

బీసీలు సోయి తెచ్చుకొని పోరాడాలి

బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27: 'స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా బీసీలకు రాజ్యాధికారం రాలేదని, ఇప్పటికైనా సోయి తెచ్చుకొని కలిసి కట్టుగా పోరాడాలని' వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ అనాధిగా బీసీలకు అన్యాయమే జరుగుతూ వచ్చిందని, ఇప్పటికైనా మేల్కోకపోతే అగ్రవర్ణ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మిగిలిపోతారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీల వాట సాధన కోసం మార్చి 1వ తేదీ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం మీర్‌గావ్‌పల్లె గ్రామం నుంచి పాదయాత్ర మొదలై 20న ఖిలాషాపూర్‌లోని సర్దార్ సర్వాయ్ పాపన్న కోట వద్ద ముగుస్తుందన్నారు. ఈ పాదయాత్రలో కులాలకు అతీతంగా బీసీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, హిందూ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రమణ, జేఏసీ వైస్ చైర్మన్లు వెలుగు వనిత, ఏటిగడ్డ అరుణ పటేల్, పటేల్ వనజ, బీసీ నాయకులు డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్, పాల్గొన్నారు.

నాడు ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని..

ఇప్పుడు గడువు విధిస్తారా..?

- ఎన్నికలముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి
- పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్‌కుమార్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ) : లే అవుట్ రెగ్యులరైజ్ స్కీం(ఎల్ఆర్ఎస్)కు మార్చి 31వ తేదీ వరకు నిర్ణీత గడువు విధించడం తగదని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటించి.. ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు గడువు విధించి పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని లేదా ఫీజును సగానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యతిరేక ఫలితాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. పేద ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నిరంతరంగా కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ అనుమతులు పొందే సమయంలో, రిజిస్ట్రేషన్ సమయంలో ఎల్ఆర్ఎస్ ఫీజులను తీసుకోవడం వలన సామాన్యులతో పాటు ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరుతుందన్నారు. అయితే మార్చి 31వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ చెల్లించాలని నిబంధనలు విధించడంతో సామాన్యుడికి డబ్బులు ఎలా సమకూరుతాయని ప్రశ్నించారు.

ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వాకథాన్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 3 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) నగరంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో '2 కె వాకథాన్' నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ కె.నిఖిల, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ వాకథాన్‌లో యూబీఐ సీజీఎం కె.భాస్కర్‌రావు, ఎస్‌బీఐ జీఎం, ఎస్ఎల్‌బీసీ తెలంగాణ కన్వీనర్ దేబాశిష్ మిత్ర, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల ప్రతినిధులు, ఆర్‌బీఐతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, యూనివర్సిటీ విద్యార్థులు సుమారు 400 మందికిపైగా పాల్గొన్నారు.

మార్చి 7 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27 : జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి 4వ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 7నుంచి 17వ తేదీవరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఏసీ ఉపాధ్యక్షుడు రాఘవేందర్, టీటీడీ డిప్యూటీ ఈవో రమేశ్‌బాబు, సభ్యులు రంగు వెంకటేశ్ గౌడ్, ఉమా ఎస్ కౌడి, బోజి రెడ్డి, వెంకటాచలపతి, పూర్ణచందర్, షణ్ముకేశ్వర్‌రావు, అనూప్ చక్రవర్తి, నరేందర్‌రెడ్డి, శివ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఆర్ఐలో ముగిసిన వర్క్‌షాప్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : భూగర్భ జల వనరులను సంరక్షించుకోవడంతో పాటు, వెలికితీసే క్రమంలోనూ సాంకేతిక వినియోగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్‌కుమార్ అన్నారు. గ్రౌండ్ వాటర్ అన్వేషణ, వెలికితీతపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలను వెలికితీసే సమయంలో కలిగే ఇబ్బందులు, వాటిని అధిగమించడంపై సూచనలు చేశారు. ఎన్జీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ డా.ఎన్.రవికుమార్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలను వెలికితీసే సమయంలో ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించడంపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. రెండు వారాల పాటు నిర్వహించిన ఈ ప్రత్యేక ట్రైనింగ్ సెషన్ ముగింపు కార్యక్రమంలో ఎన్జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

శ్రీహరి కోటకు ఆశ్రిత హోమ్ బాలలు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 27 : సికింద్రాబాద్‌లోని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని బాలుర ఆశ్రమానికి చెందిన 50మంది చిన్నారులను శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్ర సందర్శన, విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్లారు. హైదరాబాద్ జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వర రావు జెండా ఊపి విహారయాత్రను ప్రారంభించారు. ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎస్.నాగరాజు, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, శేఖర్, హరీశ్, చంద్ర, రాజు, పాల్గొన్నారు.

చిట్టి బుర్రలు.. ఎంత అద్భుతమో..!

ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనల వివరాలను తెలుసుకుంటున్న షబ్బీర్ అలీ, ఓమెర్ జలీల్

కొండాపూర్, ఫిబ్రవరి 27 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ స్కూల్స్ ఆధ్వర్యంలో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, మైనార్టీ వెల్ఫేర్ విభాగం సెక్రటరీ సయ్యద్ ఓమెర్ జలీల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో 204 పాఠశాలకు చెందిన 2000 మంది విద్యార్థులు తాము వేసిన పలు చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన ఈ నెల 29 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

హైవే అభివృద్ధి ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం

ఎన్‌హెచ్ఏఐ చీఫ్ జనరల్ మేనేజర్ రజాక్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27 : తెలంగాణ రాష్ట్రంలో హైవే అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్, హైదరాబాద్ రీజనల్ ఆఫీసర్ ఎస్‌కే రజాక్ పేర్కొన్నారు. తెలంగాణలో 2014 నుంచి హైవే అభివృద్ధి కార్యక్రమాలకు రూ.34 వేల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఆధునిక పద్ధతిలో భూ సేకరణతో ఆయా ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖతో కలిసి బంజారాహిల్స్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో భూ సేకరణకు ప్రవేశపెట్టిన 'భూమి రాశి పోర్టల్' పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఓఆర్‌టీ అండ్ హెచ్ డిప్యూటీ సెక్రటరీ అభయ్ జైన్, న్యూ ఢిల్లీ (భూ సేకరణ), ఎన్‌హెచ్ఏఐ హెచ్‌క్యూ జనరల్ మేనేజర్ వైభవ్ మిట్టల్ (భూ సేకరణ), జాయింట్ అడ్వైజర్ రాజేశ్ కుమార్ (జీఐఎస్) పాల్గొని భూమి రాశి పోర్టల్ పనితీరును, భూ సేకరణ ప్రక్రియ, పరిహారం చెల్లింపులపై అవగాహన కల్పించారు.

నేడు తెలుగు వర్సిటీ స్నాతకోత్సవం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 27 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవ కార్యక్రమం ఈ నెల 28న ఉదయం 11గంటలకు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్, పీహెచ్‌డీ, పీజీ, డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సుల పట్టాలను, ఆయా విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తీర్ణులకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ పతకాలను అందజేయనున్నారు. ప్రముఖ నాట్య గురువు కళాకృష్ణకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావాణి వినరా?

- ఫిర్యాదుల స్వీకరణకు ఉన్నతాధికారులు దూరం
- కిందిస్థాయి అధికారులతోనే దరఖాస్తుల స్వీకరణ
- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం
- ప్రజలు ప్రశ్నిస్తే తప్పించుకు తిరుగుతున్న అధికారులు
- ప్రజావాణిని నీరుగార్చే ప్రయత్నమంటూ అరోపణలు

ప్రజావాణి కార్యక్రమంలో సెక్షన్ అధికారులు దరఖాస్తుల స్వీకరణ(ఫైల్)

మేడ్చల్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యలపై ప్రజల నుంచి ఎప్పటికప్పుడు దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించతలపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నది. గతంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డిప్యూటీ కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించి వెంటనే పరిష్కారం చూపేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజావాణి వినేందుకు జిల్లాస్థాయి అధికారులు దూరంగా ఉంటున్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కిందిస్థాయి అధికారులచే దరఖాస్తులను స్వీకరించి వాటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రజాలు ఇచ్చిన దరఖాస్తుల విషయమై అధికారులను నిలదీస్తే ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నాలుగు వారాల పాటు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 583 దరఖాస్తులు రాగా.. వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ నెల 12వ తేదీ నుంచి మూడు వారాలుగా నిర్వహిస్తున్న ప్రజావాణిలో లా ఆఫీసర్ చంద్రావతి పాల్గొని దరఖాస్తులు స్వీకరించగా, 19వ తేదీన జరిగిన ప్రజావాణిలో డీఆర్వో హరిప్రియ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. 26న జరిగిన ప్రజావాణిలో సెక్షన్ సూపరింటెండెంట్ గీత, భూపాల్ దరఖాస్తులను స్వీకరించారు. అయితే అధికారులు స్వీకరించిన దరఖాస్తులను ఉన్నతాధికారులు పట్టించుకోకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజావాణిలో ఉన్నతాధికారులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు సమాచారం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నాయకులు, జర్నలిస్టులు.. విలువలను పాటించాలి

పుస్తకావిష్కరణలో పాల్గొన్న వెంకయ్యనాయుడు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 27 : రాజకీయ నాయకులు, జర్నలిస్టులు ప్రమాణాలను పాటించాలని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి రెడ్‌హిల్స్ ఫ్యాప్సీలో సీనియర్ జర్నలిస్టు అరుణ రవికుమార్ రచించిన 'దేర్ ఐ వాయిస్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుత సమాజంలో రాజకీయ నాయకులు, జర్నలిస్టులు ప్రజల గౌరవాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ రచయిత్రి సాధించిన విజయాలు పుస్తక రూపంలో తీసుకురావడం గొప్పగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్టీఓ మాజీ కార్యదర్శి డాక్టర్ జి.సతీష్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యాన్ని అధిగమించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ) : 2024 సంవత్సరానికి గాను హరితహారంలో భాగంగా లక్ష్యాన్ని అధిగమించేలా అధికారులు పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో మంగళవారం హరితహారం కార్యక్రమంపై కలెక్టర్ గౌతమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఇచ్చిన హరితహారం లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించి, హరిత నిధిలో ఎన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ గౌతమ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులు సంఘటితమై హక్కులు సాధించుకోవాలి

డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, బాలాచారి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27: తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగులు సంఘటితమై హక్కులు సాధించుకుంటేనే రాజ్యాధికారం వస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బీసీ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నామోజు బాలాచారి, ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌గౌడ్ అధ్యక్షతలో జరిగిన ఈ కార్యక్రమంలో డి.రమ, రాధారాణి, తాళ్లపల్లి సురేశ్, ఎం.రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్షలు, అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

ప్రముఖ పత్రికా సంపాదకులు కె.శ్రీనివాస్

సదస్సులో మాట్లాడుతున్న పత్రికా సంపాదకులు కె.శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 27 : లక్ష్యాలు, ఆశయాల సాధనకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సమీక్షించుకుని, మెరుగైన సమాజం కోసం ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నదని ప్రముఖ పత్రికా సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ : ఎమర్జింగ్ ఇష్యూస్, పాలసీ ఇంటర్వెన్షన్స్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్'అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు కొనసాగుతున్నది. రెండో రోజు సదస్సులో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి కోసం ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఆముదాల పంట దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నా ఆముదాల ప్రాసెసింగ్ యూనిట్ గుజరాత్‌కు తరలి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నీల రాములు, ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు, ఇక్బాయ్ ప్రొఫెసర్ కోటిరె